క్లుప్తంగా

రోడ్డుపై మరమ్మతులకు గురైన 108 వాహనం



బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు గ్రామ శివారులో 216 జాతీయ రహదారిపై 108 వాహనం మరమ్మతులకు గురై రోజంతా అక్కడే నిలిచి ఉంది. బంటుమిల్లి ప్రాంతంలోని వ్యక్తులు మంగళవారం తెల్లవారు జామున 108 సేవలకు ఫోన్ చేసినట్లు తెలిసింది. దీంతో కేసుకు అటెండ్ అయ్యేందుకు మచిలీపట్నంకు చెందిన 108 వాహనాన్ని పురమాయించారు. ఈ వాహనం అర్తమూరు వద్దకు చేరేటప్పటికి మార్గ మధ్యంలో మరమ్మతులకు గురైంది. ఆ వెంటనే బంటుమిల్లి 108 సిబ్బందికి ఫోన్ చేసి కేసుకు అటెండ్ కావాలని ఆదేశించారు. ఇప్పటికే కృత్తివెన్ను మండల 108 వాహనం విజయవాడలో ఉండటంతో మచిలీపట్నం 108 వాహనానికి మరమ్మతులు చేయడానికి రోజంతా పట్టడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు బస్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఆర్టీసీ బస్



చల్లపల్లి(అవనిగడ్డ): ప్రైవేటు కళాశాల బస్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్ ఢీకొన్న ఘటన మంగళవారం చల్లపల్లిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంలో ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన బస్ విద్యార్థులను తీసుకెళ్లేందుకు చల్లపల్లి ప్రధాన సెంటర్ మలుపులో దుకాణాల ముందు ఆగి ఉంది. అవనిగడ్డ నుంచి మచిలీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్ ఆగిఉన్న ప్రైవేటు బస్‌ని వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రైవేటు బస్ వెనుక అద్దాలు పగిలాయి. ఎవరికీ ఏలాంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్పీడుగా ఢీకొని ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద సమయంలో కాలేజీ బస్సులో 9 మంది, ఆర్టీసీ బస్సులో 29 మంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో చీడపీడలకు చెక్



గూడూరు: ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి పంటకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ విభాగం కృష్ణా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కోన పార్థసారథి అన్నారు. మంగళవారం మండలంలోని తరకటూరులో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో భూమిలో సారం పెరగటానికి జీలుగకు బదులు నవధాన్యాలు వేస్తామని వివరించారు. ఎరువులకు బదులు ఆవుపేడ, ఆవు మూత్రం, పుట్టమట్టి, సున్నం 200 లీటర్ల డ్రమ్‌లో పులియబెట్టి ప్రతి వారం సాగునీటి ద్వారా ద్రవ, ఘన, జీవామృతాలుగా వినియోగిస్తామని తెలిపారు. రసాయన ఎరువులు వినియోగించిన పొలంలో పురుగులు ఆశించడం, దానికి మళ్లీ పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తుందన్నారు. దీనిని గుర్తించి రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలోకి మారాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



కె. కొత్తపాలెం(మోపిదేవి): మండలంలో వరద ప్రభావిత గ్రామాలైన కె.కొత్తపాలెం హెచ్ డబ్ల్యూ పాఠశాల విద్యార్థులకు లండన్ నివాసి పుప్పాల ధనుంజయ ఆర్థిక సాయంతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, దుప్పట్లను అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో–1 దుర్గాసాగర్, ఎంఈవో– 2 అన్నపరెడ్డి పిచ్చయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ సుబ్రహ్మణ్యం, టీవీ సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల దాణా అందజేత

ఘంటసాల: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఘంటసాల పెద్దగూడెంకు చెందిన కొడాలి భాస్కరరావుకు చెందిన పశువుల చావిడి, వరిగడ్డి వాము దగ్ధమై మూడు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కూటమి నేతలు గొర్రెపాటి శ్రీనివాసరావు, యార్ల శ్రీకాంత్ ఆర్థిక సహకారంతో పశువుల దాణాను సమకూర్చగా సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ చేతుల మీదగా మంగళవారం పంపిణీ చేశారు. కె.శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాయ్ రాజా కాయ్

మచిలీపట్నంలో విచ్చలవిడిగా పేకాట | **లక్షలు ఆర్జిస్తున్న పేకాట నిర్వాహకులు** | **వీధినపడుతున్న బాధిత కుటుంబాలు** | **సమాచారం ఉన్నా స్పందించని పోలీసులు**



కోనేరుసెంటర్: బందరులో పేకాటలు ఊపందుకున్నాయి. కాయ్ రాజా కాయ్ అంటూ పందెంరాయుళ్లు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పదుల సంఖ్యలో నిర్వాహకుల కుటుంబాలు లక్షలు ఆర్జిస్తున్నాయి. వందల సంఖ్యలో జూదరుల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. పోలీసులు పట్టించుకోకపోవటంతో పట్టణం, పల్లెల్లోనూ పేకాట మూడు ముక్కలు..ఆరు చిత్తులుగా విరాజిల్లుతోంది.

పగలూ, రాత్రీ తేడా లేదు..

బందరులో పట్టణం, పల్లెలోనూ పేకాటలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో ఆటగాళ్లు మరింత బరితెగిస్తున్నారు. కొన్ని నెలలుగా బందరు వదిలి ఆటల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన పేకాటరాయుళ్లు ఇప్పుడు బందరులో జరుగుతున్న పేకాటల వైపు పరుగులు పెడుతున్నారు. పలు చోట్ల ఈ ఆటలు చిల్లరగా, మరి కొన్ని చోట్ల పెద్ద ఎత్తున లక్షల్లో జరుగుతున్నాయి. కొంత మంది పేకాటరాయుళ్లు పేకాట శిబిరాలను రోజుకో ప్రాంతానికి మారుస్తూ పోలీసుల కళ్లు గప్పే ప్రయత్నం చేస్తుండగా, ఇంకొందరు ఒకే ప్రదేశంలో ఆటలు పెడుతూ పేకాటరాయుళ్ల సొమ్ము దోచేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

పేకాట నిర్వాహకులు లక్షలకు లక్షలు ఆర్జిస్తుండగా ఆటగాళ్లు అప్పులపాలైపోతున్నారు. నగరంలోని బైపాస్‌రోడ్డుకు పక్కన ఉన్న శ్మశానవాటికలో అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు పేకాడిస్తూ పందెంరాయుళ్ల ధనాన్ని దోచేస్తున్నాడు. చిలకలపూడి రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఎన్టీఆర్ కాలనీలో కొన్ని నెలలుగా లక్షల్లో కోతముక్క జరుగుతున్నట్లు ప్రచారంలో ఉంది. కాలేఖాన్‌పేటకు చెందిన మరో యువకుడు ఆ ప్రాంతంలోని అనేక చోట్ల పగలు, రాత్రి పేకాటలు పెడుతూ తియ్యటి మాటలు చెబుతూ పందెంరాయుళ్ల సొమ్ము దోచేస్తున్నాడు. నగరంలోని కోనేరుసెంటర్‌కు కూతవేటు దూరంలో ఆనవాళ్లు లేకుండా పోయిన ఓ సినిమా థియేటర్‌కు ఆనుకుని ఉన్న లాడ్జిలో కొంత మంది రూం బుక్ చేసుకుని నెల రోజులుగా భారీస్థాయిలో కోతముక్క ఆడుతున్నట్లు తెలుస్తోంది. పెడన మండలం కాకర్లమూడి గ్రామానికి చెందిన మరో యువకుడు బందరు మండలంలోని గోకవరం, బీచ్‌కు సమీపంలోని ఉప్పుకొటార్‌లలో భారీ స్థాయిలో ఆటలు నిర్వహిస్తూ లక్షలు పోగుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బలరామునిపేటకు చెందిన ఓ వ్యక్తి పామర్రుకు సమీపంలోని పలు ప్రాంతాల్లో పేకాటలు (కోసు) పెడుతూ రోజుకు లక్షల్లో దోచేస్తున్నట్లు ప్రచారంలో ఉంది.

పేకాటలో 'వడ్డీ' జలగలు..

పేకాటల దగ్గర వడ్డీ వ్యాపారం చేస్తూ కొందరు పందెంరాయుళ్ల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణానికి చెందిన పలువురు ఈ రకమైన వ్యాపారానికి అలవాటుపడి నూటికి రూ.10 చొప్పున రోజు వారీ వడ్డీ వసూలు చేస్తూ రోజూ ఆటగాళ్లను బట్టి అప్పులు ఇస్తూ వేలల్లో పేకాటరాయుళ్ల ధనాన్ని దోచేస్తున్నారు. ఆటలు భారీ స్థాయిలో సాగేందుకు నిర్వాహకులే వడ్డీ వ్యాపారులను అక్కడికి ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. వడ్డీ వ్యాపారుల వలలో చిక్కుకుని ఒంటిపై బంగారంతో పాటు చేతిలో ఉన్న వాహనాలను కూడా వదులుకోవాల్సివస్తోందని పలువురు బాధితులు ఆవేదన చెందుతున్నారు.

స్పందిస్తే మేలు..

బందరులో పేకాటలు భారీ స్థాయిలో జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పేకాట శిబిరాలపై ఉక్కుపాదం మోపాలని బాధిత కుటుంబాలు వేడుకుంటున్నాయి.

గోకులం షెడ్లు అర్హులకా ? అధికార పార్టీ వారికా ?



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ నాగరాజు, వేదికపై ఎంపీపీ, జెడ్పీటీసీ

మండల సర్వసభ్య సమావేశంలో నిలదీత

ఘంటసాల: పశువులు మేపుకునే వారి కోసం కూటమి ప్రభుత్వం మంజూరు చేస్తున్న గోకులం షెడ్లు అర్హులకా? అధికార పార్టీ వారికేనా అంటూ వైస్ ఎంపీపీ మాదెం నాగరాజు అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేమూరి రజనీకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. వెటర్నరీ ఇన్‌చార్జి వైద్యాధికారి పి.మనోజ్, ఎన్ఆర్ ఈజీఎస్ అకౌంటెంట్ బాలు గోకులం పథకం గురించి వివరిస్తూ మండలంలో 111 మంది గోకులం పథకం ద్వారా షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోగా 50 మంజూరైనట్లు చెప్పారు. దీనిపై వైస్ ఎంపీపీ నాగరాజు మాట్లాడుతూ లంకపల్లి గ్రామంలో నలుగురు దరఖాస్తు చేసుకోగా టీడీపీ నేతలు చెప్పిన ముగ్గురికి మాత్రమే ఇచ్చారని, వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన మరో వ్యక్తికి గోకులం కింద షెడ్డు మంజూరు చేయలేదని ఆరోపించారు. గోకులం షెడ్లు అర్హులకా? అధికారపార్టీ వారికేనా అంటూ నిలదీశారు. దీంతో అధికారులు, ఎంపీడీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చారు. పంచాయతీల పరిధిలోని చేపల చెరువులను మత్స్యకార సొసైటీ వారు తక్కువ ధర చెల్లిస్తూ వారు రెట్టింపు ధరకు లీజుకిచ్చి పంచాయతీలకు ఆదాయం రాకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించాలని, ఘంటసాల, శ్రీకాకుళం పశువైద్యశాలల్లో డాక్టర్లను నియమించాలని కోరారు. అనంతరం వివిధ పంచాయతీల్లో రూ.35 లక్షల విలువైన 17 పనులకు సర్వసభ్య సమావేశంలో ఆమోదం తెలిపారు. చివరిగా ఎంపీపీ రజనీకుమారి, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంపీడీవో డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

మెరకనపల్లి(మోపిదేవి): భూ రీ సర్వే వల్ల రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని మండల సర్వేయర్ రామకృష్ణబాబు తెలిపారు. మండలంలోని మెరకనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లు, తప్పులను సరిచేసే అవకాశం ఈ ప్రాజెక్టు వల్ల ఉంటుదన్నారు. రైతు ఓగిరాల చంద్రశేఖరశర్మకు రెండు ఎకరాలు మాగాణి భూమి అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాల్లో ఉండగా రీ సర్వేద్వారా వచ్చిన ఎల్‌పీ నంబర్‌లో 10 సెంట్లు తగ్గిందని సరిచేసి పెట్టాలని కోరారు. కోసూరువారిపాలెంకు చెందిన రైతు ఎనికే రేణుకయ్య తన భార్య పేరు రేణుకమ్మ పేరున పసుపు, కుంకుమ కింది వచ్చిన ఎకరం భూమి అడంగల్‌లో ఉందని, పాస్‌బుక్ ఇవ్వలేదని చెప్పారు. ఈ భూమి మధ్యలో చిరువోలు, మెరకనపల్లి పొలిమేర డొంక రావడంతో 13 సెంట్లు చిరువోలు రెవెన్యూలోనూ, 87 సెంట్లు మెరకనపల్లి రెవెన్యూలోనూ వచ్చిందని తెలిపారు. ఈ రీ సర్వే ద్వారా అయినా మా భూమికి మోక్షం కల్పించాలని అధికారులను వేడుకున్నారు. గ్రామ సభ ద్వారా 19 దరఖాస్తులు అందాయని, నవంబర్ 11వ తేదీ లోగా వాటికి పరిష్కారాలు సూచిస్తామని మండల సర్వేయర్ తెలిపారు. ఇన్‌చార్జి ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్ నడకుదుటి గోపిరాజు, వీఆర్వోలు మోపిదేవి వెంకటేశ్వరావు, ప్రశాంతి, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మెరకనపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న రైతులు

దాలిపర్రు(ఘంటసాల): ఇటీవల జరిగిన భూముల రీసర్వేలోని సమస్యలను పరిష్కరించడానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. మండలంలోని దాలిపర్రు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు పేరుతో గ్రామ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి తొమ్మిది అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోకిపర్తి శాంత కుమారి, రీసర్వే డీటీ పి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ వల్లీపుష్ప, వీఆర్వో నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఈఓ కె.నాగ నాంచారమ్మ, సర్వేయర్లు మానస, హర్ష పాల్గొన్నారు.

షాపుల ఏర్పాటుకు పటిష్ట చర్యలు చేపట్టండి

బాణసంచా షాపుల ఏర్పాట్లపై అధికారులతో ఆర్డీవో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో స్వాతి

చిలకలపూడి(మచిలీపట్నం): దీపావళి పండుగ సందర్భంగా మందుగుండు సామగ్రి షాపుల నిర్వాహకులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని బందరు ఆర్డీవో కె.స్వాతి అన్నారు. కలెక్టరేట్‌లోని ఆమె కార్యాలయంలో మంగళవారం వివిధశాఖల అధికారులతో షాపుల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మందుగుండు సామగ్రి షాపుల లైసెన్సుల జారీ, అమ్మకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి ఏ ఒక్కరికీ ప్రమాదం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులకు షాపులు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాల్సి ఉందన్నారు. దుకాణాలను తనిఖీ చేసి భద్రత చర్యలు పాటించేలా చూడాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలన్నారు. గతంలోలా కాకుండా ప్రమాదాలు నివారించేందుకు నేషనల్, హిందూ కళాశాలతో పాటు మాచవరం ప్రాంతంలో మూడు అనువైన ప్రదేశాలను అధికారులతో కలిసి ఎంపిక చేసి దుకాణాలు కేటాయించాలన్నారు. షామియానాలు కాకుండా రేకులషెడ్లతో దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క దుకాణానికి మధ్యలో మూడు మీటర్ల దూరం ఉండాలన్నారు. ప్రజలకు ప్రవేశం, బయటకు వెళ్లే మార్గాలు వేరువేరుగా ఉండాలన్నారు. దుకాణాలు ఎదురెదురుగా కాకుండా ఎల్ ఆకారంలో ఏర్పాటు చేయాలన్నారు. దరఖాస్తులు వచ్చిన అనంతరం వారితో సమావేశం నిర్వహించి భద్రత చర్యలు వివరించాలన్నారు. చిన్నపిల్లలతో దుకాణాల్లో పనిచేయించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దీపావళి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకునేలా సహకరించాలన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో లతీఫ్‌భాషా, సహాయ అగ్నిమాపక అధికారి నరసింహారావు, సీఐలు షేక్ అబ్దుల్‌నబీ, జి యువకుమార్, పెడన మునిసిపల్ కమిషనర్ గోపాలరావు, తహసీల్దార్లు డి మధుసూదనరావు, వనజాక్షి, ఎం హరినాథ్, భరత్‌రెడ్డి, కె అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



ఉద్యోగాలు పొందిన వారితో సాల్మన్‌రాజు తదితరులు

పెడన: చదువుకు తగ్గ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని కుటుంబానికి చేదోడుగా ఉండాలని జిల్లా వృత్తి విద్యా కళాశాల అధికారి పీబీ సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు సుమారు 143 మంది హాజరయ్యారు. ఈ జాబ్‌మేళాను ప్రారంభించిన సాల్మన్‌రాజు నిరుద్యోగులను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువు పూర్తవగానే ఏ ఉద్యోగం అయితే లభిస్తుందో దానిలో చేరిపోవాలని, ఆ తరువాత ఉన్నత ఉద్యోగాల వైపు అడుగులు వేయడం వల్ల ఆర్థిక భారం కూడా పెద్దగా ఉండదన్నారు. కుటుంబానికి తోడు నీడగా ఉంటూ అండగా నిలవాల్సిందిగా సూచించారు. ఈ జాబ్‌మేళాలో 13 మంది ఎంపికయ్యారని, 34 మంది తదుపరి ఇంటర్వ్యూకు అర్హత సాధించారని, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ వంగా బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రూపానాగశ్రీ, యంగ్ ఇండియా ప్రొఫెషనల్ ప్రతినిధి జయరాజు, కళాశాల లెక్చరర్ నాగరవి, గిరి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



బంటుమిల్లి పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ చినబాబు

బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి, పెదతుమ్మిడి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎంపీపీ వి.చినబాబు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన ఆయన మంగళవారం వాటిని సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. స్నేక్, డాగ్ బైట్ మందుల వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్లు రెండు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని సిబ్బంది ఎంపీపీకి వివరించారు.

చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విషజ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నాక్ బృందం రాక

కోనేరుసెంటర్: జాతీయ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ బృందం ఈ నెల 23న బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయానికి రానుందని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఆర్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు నాక్ బృందం విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించి, ఆయా విభాగాల ఇన్చార్జి, సమన్వయకర్తల నుంచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకుంటుందన్నారు. అనంతరం నైపుణ్యాభివృద్ధి ముగింపు ప్రక్రియ చేపట్టి, ర్యాంకింగ్ కేటాయించేందుకు తుది నివేదికను తయారు చేస్తారన్నారు. విశ్వవిద్యాలయం స్థాపించిన తర్వాత తొలిసారి నాక్ బృందం పర్యటిస్తుండడంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

కాలనీకి ముంపు కష్టాలు



కృత్తివెన్ను: అధికవర్షాల సమయంలో కొల్లేరు నీరు ఎగదన్నడంతో మాట్లాం గ్రామంలోకి ముంపునీరు చొచ్చుకువస్తోంది. ఉన్నత పాఠశాలకు సమీపంలోనే ఏటిపాయ ఉంది. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సము ద్రపు పోటు కారణంగా నీరంతా పాఠశాల ప్రాంగణాన్ని ముంచెత్తుతుంది. గత ప్రభుత్వం జగనన్న కాలనీ పేరుతో 90 మందికి పట్టాలను పంపిణీ చేసింది. వారిలో దాదాపు 50 మంది వరకు కాలనీలో గృహాలు నిర్మాణం చేసుకున్నారు. ప్రస్తుతం నీరు వచ్చి చేరుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ముంపునీరు చేరకుండా పాఠశాల, జగనన్న కాలనీలను మెరకచేయాలని కోరుతున్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ ప్రారంభం

బంటుమిల్లి: గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందును పంపిణీ కార్యక్రమాన్ని మచిలీపట్నం పశుసంవర్థకశాఖ డీడీ డాక్టర్ నాగభూషణం మంగళవారం మల్లేశ్వరం గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ జీవాలు అనారోగ్యంపాలు కాకుండా నట్టల నివారణ మందు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ మందు వల్ల కలిగే ఉపయోగాలను జీవాల పెంపకందారులకు వివరించారు. ఇందులో భాగంగా శిబిరంలో 2,500 గొర్రెలు, 500 మేకలకు మందులు వేసినట్లు వైద్యాధికారిణి డాక్టర్ స్ఫూర్తి తెలిపారు. మండలంలో 12 వేల జీవాలను గుర్తించామన్నారు. జీవాల పెంపకందారులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మల్లేశ్వరంలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న డీడీ నాగభూషణం

ఈ శిబిరంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘ అధ్యక్ష,కార్యదర్శులు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



కోడూరు: కృష్ణా తీరం భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయ హుండీ కానుకల లెక్కింపును దేవదాయ అధికారులు మంగళవారం నిర్వహించారు. మూడు నెలలకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించగా, రూ.2,38,400 ఆదాయం లభించినట్లు ఈఓ సీహెచ్.సుధాకర్ తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్, గ్రామ ప్రముఖులు లెక్కింపులో పాల్గొన్నారు.

ఎస్ఐ–2 బాధ్యతల స్వీకరణ

పెడన: పెడన పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ–2గా వి.రాజేంద్రప్రసాద్ బాధ్యతలను స్వీకరించారు. ఈయన ఎన్నికల విధుల్లో భాగంగా పెదవేగికి బదిలీ అయ్యారు. అక్కడ నుంచి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు రాగా అక్కడే ఉంటూ పెడనకు నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం బాధ్యతలను స్వీకరించిన ఆయన మర్యాదపూర్వకంగా పెడన సీఐ, మచిలీపట్నం డీఎస్పీలను కలిశారు. మంగళవారం నుంచి విధులకు హాజరయ్యారు. పలువురు స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పోలీసు విధివిధానాలపై అవగాహన



బంటుమిల్లి: ప్రజల సంరక్షణలో ప్రధానపాత్ర పోషించే పోలీసులు ప్రతిరోజూ విధులలో అనుసరించే విధివిధానాలు తదితర అంశాలపై ఎస్ఐ గణేష్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక వాగ్దేవి జూనియర్ కాలేజీ విద్యార్థులకు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది విధివిధానాలు కేసుల నమోదు, రికార్డులు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

45 మద్యం బాటిళ్లు స్వాధీనం



కోడూరు: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను కోడూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చాణిక్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన ముప్పిరిశెట్టి శివయ్య కోడూరు నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. నరసింహపురం గ్రామ సమీపంలో శివయ్యను తనిఖీ చేయగా 45 మద్యం సీసాలు లభించినట్లు ఎస్ఐ చెప్పారు. మద్యం సీసాలను సీజ్ చేసి, శివయ్యను అరెస్టు చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమ మద్యం, రేషన్, మట్టి, ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

అధికారులకు సన్మానం

ఘంటసాల: మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.సుబ్బారావు, ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుగుణ కుమారిలను శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ చిన్నా ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు మంగళవారం సాయంత్రం దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యండకుదురు, మల్లాయి చిట్టూరు సర్పంచులు ముళ్లపూడి పట్టాభి రామారావు, ఆవుల రేవతి, ఎంపీటీసీ సభ్యులు సిద్ధినేని కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: మండలంలోని నరసింహాపురం గ్రామంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే పనులతో పాటు మరమ్మతులు చేయనున్నట్లు వారు వివరించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నామన్నారు.